క్లుప్తంగా

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



ధరూరు: క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి ధరూరులోని ఎంబీ షాలేం చర్చిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననంపై సందేశాత్మక పాటల నృత్యాలు, స్కిట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సంఘకాపరి ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికంగా సాగింది. చిన్నారుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. యువతీ, యువకులు, మహిళలు డ్రెస్ కోడ్‌తో ఆకట్టుకున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

అయిజ: క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.30,016ను అయిజ పట్టణానికి చెందిన ఎస్‌ఎంఎస్ టీం, ద్వితీయ బహుమతి రూ. 20,016ను సీ బెలగల్ టీం సభ్యులు అందుకున్నారు. కార్యక్రమంలో భూంపురం నరసింహారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు రాములు, నాయకులు మారెప్ప, లెనిన్ బాబు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయవంతం చేయండి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని వి జయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఎంపీడీఓ సాయి ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల కోసం ప్రజల నుంచి సంబంధిత అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకరావాలని కోరారు. వివరాలకు సంబంధిత కార్యాలయాల అధికారులను సంప్రదించాలని సూచించారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టండి



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి పెద్దపోతులపాడు వయా అలంపూర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద కల్వర్టు గుంతలతో, వర్షాకాలం రోడ్డు దాటాలంటే ఇబ్బందులకు గురవుతున్నట్లు చెన్నిపాడు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వర్షలు కురిసి రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కల్వర్టు నిర్మాణం చేపట్టి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులకు తొలగించాలని అధికారులను కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి



మానవపాడు: మండలంలోని జాతీయ రహదారి నుంచి బోరవెల్లికి వెళ్లే దారిలో దాదాపు 1కిలో మీటరు దూరం కంకర రోడ్డు వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజులుగా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినా, పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను గురువారం నుంచి స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రెండు టీంలుగా ఏర్పడి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒక టీంకు ఎంపీడీఓ, మరో టీంకు తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, రైతు వేదికల్లో 44 కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఆయా గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులకు వివరాలు పంపినట్లు తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకం, సదరం సర్టిఫికెట్, కరెంట్ బిల్లు తదితర జిరాక్స్‌లు పెట్టాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

‘ఉపాధి’ గ్రామసభలు

- 2024–25లో గ్రామాల్లో చేపట్టే పనులకు ఆమోదం
- ప్రణాళికలు రూపొందించి తీర్మానాలు
- గ్రామసభల్లో ఉపాధి కూలీల సమస్యలపై అవగాహన
- కూలీలకు సమాచారం ఇవ్వని అధికారులు



చిన్న ఆముదాలపాడు ఉపాధి గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

ఉండవెల్లి: గ్రామాల్లో వలసలను నిరోధించి ప్రజలకు సొంత ఊరిలో పని కల్పించడమే ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశ్యం–గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2024–25లో చేపట్టే పనుల గుర్తింపునకు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం జిల్లాలోని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

పనుల గుర్తింపునకు గ్రామసభలే కీలకం..

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు తప్పనిసరిగా గ్రామసభ ఆమోదం లభించాలి. గ్రామసభలో పంచాయతీ పరిధిలో ఏయే రకం పనులు చేపడుతారో పాలకవర్గం, ప్రజలు చర్చించుకుని ప్రణాళికలు రూపొందించి తీర్మానాలు చేస్తారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సభల్లో కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై గ్రామాభివృద్ధి, వ్యక్తిగత పనులతో పాటు రైతులు తమ చేనుల్లో పనులు చేపట్టాలని కోరవచ్చు. ఇప్పటికే కొన్ని గ్రామసభలో చేపట్టే పనులపై తీర్మానాలు చేసి సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. గ్రామసభల్లో ఆమోదం లభించకుండా పనులు చేపట్టేందుకు అవకాశం ఉండదు.

ఉండవెల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించారు. కంచుపాడు, తక్కశిల, చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు, మారమునగాల, బస్వాపురం, బొంకూరు, మెన్నిపాడు, ఏ బూర్దిపాడు, పుల్లూరు, ఇటిక్యాలపాడు, శేరుపల్లె గ్రామాల్లో ఇటీవల ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకుంటే కూలీలకు పని కల్పించడంతో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి.



శేరుపల్లెలో నర్సరీలో పని చేస్తున్న కూలీలు

వివిధ రకాల పనులు..

ఉపాధి హామీ పథకంలో 56 రకాల పనులు చేపట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా పంట చేలలో నీటికుంటలు, గుంతలు తవ్వడం, ఇంకుడుగుంతలు తవ్వకం, పశువులపాక నిర్మాణ, పశుగ్రాసం పెంపకం, పశువుల నీటితొట్టెల నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్లులో సేంద్రియ ఎరువుల తయారీ, పంచాయతీ నర్సరీల నిర్వాహణ, పండ్ల తోటల పెంపకం, టేకు చెట్ల పెంపకం, వర్షపు నీటి కాల్వలు, బంజార భూములను సాగు యోగ్యంగా మార్చడం, రహదారులు, మట్టిరోడ్లు, శ్మశానవాటికల అభివృద్ధి, నర్సరీల నిర్వాహణ, హరితహారం మొక్కల సంరక్షణ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్వాహణ, చెరువుల నిర్మాణం, పూడిక తీత వంటి తదితర పనులను గ్రామసభల్లో ఆమోదించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవచ్చు.

తీర్మానాల మేరకే పనులు..



గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా కొత్తగా చేపట్టే పనులకు ప్రణాళికలు తయారు చేశాం. ఇందుకు అన్ని గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి సర్పంచుల ద్వారా తీర్మానాలు తీసుకుంటున్నాం. ఈపథకంతో జాబ్‌కార్డు కల్గిన వారందరికి పని కల్పిస్తాం. రైతులకు కూడా మేలు జరుగుతుంది.

– విజయశంకర్, ఏపీఓ, ఉండవెల్లి

బాలసదనంలో వీర్‌బాల్ దివస్



వీర్‌బాల్ దివస్‌లో డీడబ్ల్యూఓ, సిబ్బంది

గద్వాల అర్బన్: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో వీర్‌బాల్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టర్ ద్వారా ప్రధాన మంత్రి సందేశాన్ని ప్రసారం చేసి, చిత్ర ప్రదర్శనతో వీర్ బాల్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చిన్నారులకు డ్రాయింగ్, పెయిటింగ్ పోటీలో నిర్వహించారు. విజేతలుగా నిలిచిన చిన్నారులకు డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం బహుమతులను అందజేసి మాట్లాడారు. 1704వ సంవత్సరం డిసెంబర్ 26న బాబా జోరవర్ సింగ్, బాబా ఫతే సింగ్ చిన్నారుల ధైర్య సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ ప్రత్యేకంగా వీర్ బాల్ దివస్ నిర్వహించమని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, సిబ్బంది సురేష్, రమణ, బాలసదనం సిబ్బంది నిర్మల, లక్ష్మి, చైల్డ్‌లైన్ సిబ్బంది దస్తగిరి ఉన్నారు.

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు



గట్టు: మండలంలోని సల్కాపురంలో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామా లకు చెందిన ఔత్సాహికులు తరలి వచ్చారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి దాతలు ఇసాక్, నర్సింహులు రూ.5016లు సమకూర్చి విజేత మిట్టదొడ్డికి చెందిన ఉరుకుందు గెలుపొందారు. ద్వితీయ బ హుమతి దాత గట్టు మహబూబ్‌పాష రూ.3016లు సమకూర్చి యల్లందొడ్డికి చెందిన రామకృష్ణ దక్కించుకున్నారు. తృతీయ బహుమతి దాత డీలర్ అంపయ్య సమకూర్చిన రూ.2016లు బల్గెర హనుమంతు దక్కించుకున్నారు. బహుమతులు గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ బూబ్‌పాష, వార్డు మెంబర్ రమేష్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఇసాక్, నర్సింహులు, చంద్ర పాల్గొన్నారు.

శింగవరంలో సంకల్పయాత్ర



ప్రజలకు అవగామన కల్పిస్తున్న అధికారులు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో శింగవరం–1, శింగవరం–2 గ్రామాలలో మంగళవారం డీ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపట్టారు. వివిధ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్‌కార్డుపై ఏ ఆస్పత్రిలోనైనా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం లభిస్తుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామస్వామి, సీహెచ్‌ఓ లక్ష్మీకాంత్ బాలీశ్వరయ్య, ఆశా కార్యకర్తలు, గ్రామ సర్పంచ్ అనిత పాల్గొన్నారు.

సంపత్ కుమార్‌కు పీసీసీ ఇవ్వాలి

అలంపూర్: ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు పీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వేముల శ్యామ్ ఒక ప్రకటనలో కోరారు. సంపత్‌కుమార్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిష్టానం ఏ బాధ్యత ఇచ్చిన తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ గెలుపునకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న సంపత్ కుమార్ సేవలను గుర్తించి అధిష్టానం పీసీసీ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాలకు అయోధ్య అక్షితలు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల, బైరాపురం గ్రామాలకు అయోధ్య నుంచి వచ్చిన రామమందిర అక్షితలను పురవీధుల్లో ఊరేగించారు. ఆయా గ్రామాలకు చెందిన ఆలయాల్లో రామమందిర అక్షితలను ఏర్పాటు చేసి జనవరిలో పంపిణీ చేస్తారు. కృష్ణారెడ్డి, మహేందర్, కృష్ణా, వెంకటేష్ పాల్గొన్నారు.



సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగం

- కంపోస్టు ఎరువుల తయారీపై అవగాహన కరువు
- పట్టించుకోని అధికారులు



నీలిపల్లి సమీపంలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

మల్దకల్: గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్తనుంచి సేంద్రియ ఎరువులను తయారుచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. సేకరించిన చెత్తద్వారా తయారుచేసిన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామపంచాయతీకి ఆదాయం పెంచాలని భావించింది. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు స్వచ్ఛతను మెరుగుపరిచే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఆచరణలో మాత్రం సెగ్రిగేషన్ షెడ్లలో ముందడుగు పడడం లేదు. గద్వాల నియోజకవర్గంలోని 5మండలాల్లో 131 గ్రామపంచాయతీలు ఉండగా, ప్రతి గ్రామపంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువు మాత్రం తయారీ చేయడంలేదు. దీనికి తోడు సేకరించిన చెత్తను ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డులలో పడేస్తూ తగలబెడుతున్నారు తప్ప సేంద్రియ ఎరువు తయారీకి వినియోగించడం లేదని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో డంపింగ్‌యార్డులు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

సెగ్రిగేషన్ షెడ్డుకు రూ.2.50లక్షల వ్యయం

ఒక్కొక్క గ్రామపంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రూ.2.50లక్షలు ఖర్చు చేస్తోంది. డంపింగ్‌యార్డుల నుంచి వేరుచేసిన తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పోగుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేసే విధానంపై పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. కార్మికులకు అవగాహన లేకపోవడంతో చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి అక్కడ తగలబెడుతున్నారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు ఊరికి చివరన చెరువు కట్టల వెంట నిర్మించారు. ఈ షెడ్లు నిర్మించిన కొన్ని గ్రామాల్లో రాత్రి వేళల్లో ఆకతాయిలకు, మద్యం ప్రియులకు అడ్డాలుగా మారాయి.

వినియోగంలోకి తేవాలి



మండలంలోని గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలి. వర్మీకంపోస్టు ఎరువు తయారీపై పంచాయతీ కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. గ్రామ పంచాయతీల కు ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బుడ్డన్న, కుర్తిరావల్‌చెర్వు

ఎరువులపై అవగాహన కల్పించాలి



కంపోస్టు ఎరువుల తయారీపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ఆదేశానుసారంతో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించి న అవగాహన లోపంతో వాటిని సక్రమంగా వినియోగించడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని వినియోగంలోకి తీసుకురావాలి.

– గోవిందు, బిజ్వారం

వినియోగంలోకి తీస్తాం..



గద్వాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ఎరువుల తయారీపై మండల స్థాయిలో ఎంపీఓలకు శిక్షణ ఇచ్చి, త్వరలో గ్రామపంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. షెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చి ఎరువుల తయారీకి కృషి చేస్తాం.

– శ్యాంసుందర్, డీపీఓ, గద్వాల

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు వినతిపత్రం అందిస్తున్న నాయికులు

గద్వాల అర్బన్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయం 317జీఓ బాధిత పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్ పర్సన్ సరితకు వినతిపత్రం అందజేశారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు క్యాడర్ స్ట్రెంత్ పునర్‌వ్యవస్థీకరణ చేయలేదని, 2021లో తీసుకొచ్చిన జీఓ నెం .317ద్వారా పంచాయతీ కార్యదర్శులను జోన్, మల్టీజోన్ దాటి అలాట్‌మెంట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1,2,3 జోనల్ పోస్టులు అయినప్పటికీ గ్రామస్థాయి యూనిట్లుగా పని చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జోన్ నుంచి బాసర జోన్‌కు అలాట్‌మెంట్ చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వెంటనే జనాభా, ఆదాయ పరంగా పునర్ వ్యవస్థీకరణ చేసి, జీవో నెం.317ద్వారా స్థానికత కోల్పోయిన పంచాయతీ కార్యదర్శులు తిరిగి వారి జోన్లకు అలాట్‌మెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ



వాల్మీకి భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

అలంపూర్/అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ గ్రామంలో ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విజయుడు మంగళవారం భూమి పూ జ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీ చల్లా వాల్మీకి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. క్యాతూర్‌లో జరిగిన లింగమయ్య స్వామి మహోత్సవానికి ఎమ్మెల్యే విజేయుడు హాజరయ్యారు.

పలువురు బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మె ల్యే విజయుడు పరామర్శించా రు. ఇటిక్యాల మండలం వావిలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వావిలాల రంగారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. అయిజ మండలం వేణిసోంపురం గ్రామానికి చెందిన ఏసన్న కుమారుడు అనారోగ్యంతో కర్నూల్ లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు రఘురెడ్డి ఉన్నారు. అలంపూర్ మండలంలోని భీ మవరం చిట్టెమ్మకుమారుడు కిరణ్ మృతి చెందడంతో ఎమ్మెల్యే విజేయుడు బాధితకుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

తేనేటి విందులో ఎమ్మెల్యే

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొట్టం కాలేజీ సమీపంలో గల ఉడిపి రెస్టారెంట్‌ను మంగళవారం ఎమ్మెల్యే విజయుడు సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణనాయుడు ఆహ్వానం మేరకు ఉడిపి రెస్టారెంట్‌లో తేనేటి విందులో పాల్గొన్నారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో రఘురెడ్డి, గోపాల్ ఉన్నారు.

వ్యాధి నివారణ టీకాలు వేయించండి



టీకాలు వేయిస్తున్న వీఏఎస్ స్వరూపారాణి

అయిజ: రోగనిరోధక శక్తి పెంచేందుకు పందులకు సీఎస్‌ఎఫ్ (క్లాసికల్ స్వైన్ ఫీవర్) టీకాలు వేయించాలని, టీకాలు వేయిస్తే వ్యాధి నివారణ జరుగుతుందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. మంగళవారం పట్టణంలోని 150 పందులకు వెటర్నరీ సిబ్బంది రోగనిరోధక టీకాలు వేశారు. జ్వరం, శక్తి హీనత, ఆకలి లేకపోవడం, శరీరం లోపల రక్త స్రావం, ఆకస్మిక మరణం, కళ్లు ఎర్రబడడం, విరోచనాలు సీఎస్‌ఎఫ్ లక్షణాలు అని తెలిపారు. అడవి పందుల ద్వారా మామూలు పందులకు వ్యాధి సోకుతుందని తెలిపారు. వ్యాధి సోకిన పందులు, పంది మాంసం, కళేబరాల రవాణా ద్వారా ఇతర ప్రాంతాలకు, దేశాలకు వ్యాధి సోకుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఏ గిడ్డయ్య, ఓస్ మధు, ఎండీ సాహెబ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

గద్వాల అర్బన్: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పట్టించుకోవడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో సరైన సదుపాయాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకున్న పాపన పోలేదన్నారు. నూతన ప్రభుత్వం హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పక్కా భవనాలు నిర్మించాలని, అడ్మిషన్ల కోసం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానాన్ని ఎత్తివేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సతీష్, అశోక్, వెంకటేష్, అనిల్, వంశీ, మురళీ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



దత్తత్రేయస్వామి ఆలయానికి బయలు దేరిన దత్తస్వాములు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన 10 మంది దత్త మాలధారులు పాదయాత్రగా దత్తాత్రేయస్వామి ఆలయానికి బయలుదేరారు. అనంతరం పండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు జపిస్తూ స్వామి వారి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఇరుముడి ధరించిన దత్తస్వాములు బంద్రపల్లికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.



శాంతినగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శాంతినగర్: మార్గశిర పౌర్ణమి సందర్భంగా దత్త జయంతి వేడుకలను వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాంతినగర్ జమ్ముల మడుగు కాలనీలో వెలసిన దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన గురు దత్త స్వామి పాటలు శాంతినగర్‌లో మార్మోగాయి.

చట్టాలపై అవగాహన

శాంతినగర్: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో మంగళవారం సాయంత్రం షీ టీం బృందం, పోలీస్ కళాబృందం, భరోసా టీం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు, మహిళలకు ఉపయోగపడే పోలీస్ చట్టాలు, షీ టీం గురించి, రోడ్డు భద్రత నియమాలు, ఆపదలు సంభవిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాధమ్మ, కృష్ణ, పోలీసులు ఉన్నారు.